క్లుప్తంగా

సాక్షి డైరెక్టర్ పీవీకే ప్రసాద్‌కు పితృవియోగం


మాధవరావు(ఫైల్)

మంగళగిరి: సాక్షి దినపత్రిక డైరెక్టర్ పీవీకే ప్రసాద్ తండ్రి పాలడుగు మాధవరావు(92) శుక్రవారం సాయంత్రం కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరు జిల్లా మంగళగిరిలోని కొండపనేని టౌన్‌షిప్‌లోగల కుమారుని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఈయన స్వగ్రామం కృష్ణాజిల్లా ముస్తాబాద. పశ్చిమగోదావరి జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంకులో కార్యదర్శిగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. మాధవరావు భార్య హైమావతి 2019లో కాలం చేశారు. ఆయనకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. శనివారం మంగళగిరిలో పాలడుగు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు సంగీతంపై వర్క్ షాప్

విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో కర్నాటక సంగీతంపై శనివారం వర్క్‌షాప్ నిర్వహిస్తునట్లు సృజనాత్మక సమితి సీఈవో ఎల్.మల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత కళాశాలలో శనివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ప్రఖ్యాత విదుషీమణి హైదరాబాద్ సిస్టర్స్‌లో ఒకరైన హరిప్రియ ప్రసంగిస్తారని చెప్పారు. సంగీత అభిమానులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

ఉద్యోగోన్నతి రేసులో ఏడీసీపీ వెంకటరత్నం

విజయవాడ స్పోర్ట్స్:రాష్ట్ర హోం శాఖ శుక్రవారం విడుదల చేసిన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) ఉద్యోగోన్నతి ప్యానల్ లిస్ట్‌లో ఏడీసీపీ పి.వెంకటరత్నం చోటు దక్కించుకున్నారు. ఏఎస్పీ కేడర్‌లో ప్రస్తుతం ఆమె జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో క్రైం అడిషనల్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏడీసీపీ)గా పని చేస్తున్నారు. తాజాగా విడుదలైన ప్యానల్ లిస్ట్‌లో పేరు ఖరారు చేయడంతో త్వరలో ఆమెకు ఎస్పీగా ఉద్యోగోన్నతి దక్కనుంది.

వాటర్ ట్యాంక్ పడి వృద్ధురాలి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): సిమెంటు రేకుల షెడ్డులో పడుకొన్న వృద్ధురాలు దండిగ రమణమ్మ (60)పై ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్ పడి మృతి చెందిన ఘటన పై పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దండిగ దుర్గాప్రసాద్, రమణమ్మ భార్యాభర్తలు. కండ్రిక మీనాక్షి నగర్లోని సిమెంటు రేకుల షెడ్డులో నివసిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన సాయంత్రం రేకులషెడ్డుపై వున్న ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్ పడి ముందు గదిలో పడుకొని ఉన్న రమణమ్మపై పడింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):ముత్యాలంపాడు సెక్షన్ 11 కేవీ కేదారేశ్వరపేట, లోటస్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోటస్ ఏరియా సెక్టార్ -1, సెక్టార్ 2 , సెక్టార్ 3 , కేదరేశ్వరపేట ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి కవితల పోటీకి ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ):స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ కవితా వేదిక, సంస్కార భారతి సంయుక్త నిర్వహణలో రాష్ట్ర స్థాయి కవితల పోటీకి విద్యార్థులను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు జింకా చక్రధర్, రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో యువత పాత్ర అనే అంశంపై ఈ పోటీ ఉంటుందని, రచన పూర్తిగా సకారాత్మకంగా ఉండాలని పేర్కొన్నారు. పోటీదారులు ఆంధ్రప్రదేశ్ నివాసితులై ప్రస్తుతం జూనియర్/డిగ్రీ/డిప్లొమో/యూనివర్శిటీ విద్యార్థులై ఉండాలని తెలిపారు. రచన 20 వరుసలకు మించ రాదని, ఎక్కడా ప్రచురణ కాని సొంత రచనై ఉండాలన్నారు. ఒకరు ఒక కవిత మాత్రమే పంపాలని, కవితతోపాటు పేరు, సెల్ నెంబర్, కాలేజి పేరు, ఊరు పేరు 9246471593, 9848035573 వాట్సప్ నంబర్లకు పంపాలని కోరారు. ఎంపికైన కవితలను ఈ నెల 13న వర్చువల్‌గా జరిగే సమావేశంలో స్వయంగా చదివే అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు ప్రోత్సాహక బహుమతులు కూడా ఉంటాయని పేర్కొన్నారు. కవితలను ఈ నెల 10వ తేదీలోగా పంపాలని సూచించారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):బడి ఈడు పిల్లలు అందరూ బడిలోనే ఉండాలని డీఆర్‌ఓ మోహన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకతో కలిసి ఎంఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో బడి బయట ఉన్న విద్యార్థులను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు.

సీఎం జగనన్నతోనే పేదల అభ్యున్నతి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు


మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):నిరుపేదలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అమితమైన ప్రేమ అని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మాత్రమే పేదల అభ్యున్నతి సాధ్యపడుతుందని ప్లానింగ్ బోర్డు వైఎస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని 265వ వార్డ్ సచివాలయం పరిధిలో శుక్రవారం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన సి బ్లాక్‌లోని 288 గడపలను సందర్శించారు. స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వీక్షించి వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని చెప్పారు. పథకాల గురించి వివరించి అన్ని అర్హతలు ఉన్నా కూడా పొందలేని వారి వివరాలను తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి సాంకేతిక లోపాలను సరిచేసి తప్పనిసరిగా పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు.

■ టీడీపీ పాలన రాష్ట్ర ప్రజలకు ఓ పీడకల....

గతంలో టీడీపీ పాలన రాష్ట్ర ప్రజలకు ఓ పీడకల అని, చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో ప్రజలకు చేసింది శూన్యమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పాలనలో తెలుగు తమ్ముళ్లు దోచుకోవడం , దాచుకోవడమే ధ్యేయంగా పనిచేశారని ధ్వజమెత్తారు. సెంట్రల్ ప్రజలు ఎదుర్కొంటున్న ఇళ్ల పట్టాల సమస్యలను కూడా పరిష్కరించాలన్న కనీస జ్ఞానం కూడా గత పాలకులకు లేకపోవడం హాస్యాస్పదమని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. వీటికి సంబంధించిన లెక్కలు, జీఓ కాపీలు చూపడానికి తాము సిద్ధమన్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల్లో ప్రజలను మోసం చేయాలనే దురుద్దేశంతో కొత్త డ్రామాలకు తెరదీయడం సిగ్గుచేటని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన అభివృద్ధి పనులపై త్వరలోనే శ్వేతపత్రం విడుదలచేసి ప్రజల ఎదుట ఉంచుతామని తెలిపారు. అసమర్థులు ఎవరో, సమర్థ పాలకులు ఎవరో ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి టీడీపికి ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పడం ఖాయమని హెచ్చరించారు.

■ ప్రజా సమస్యలపై మాట్లాడే నైతికత టీడీపీకి లేదు
డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ

అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలను గాలికొదిలేసి, నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోకుండా తిరిగిన టీడీపీ నాయకులకు ప్రజా సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు లేదని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మండిపడ్డారు. టీడీపీ నాటి తమ ఐదేళ్ల పాలన కాలమంతా మొద్దు నిద్రపోయి చివరి రెండు నెలల్లో తూతూమంత్రంగా శిలాఫలకాలు ప్రారంభించారని తెలిపారు. తప్పుడు జీవోలు తెచ్చి ఎన్నికల కోడ్ అంటూ ప్రజలను మోసం చేయాలని చూడడం సిగ్గుచేటని విమర్శించారు. టీడీపీ నాయకులకు దమ్ము ధైర్యం ఉంటే ఎవరి హయాంలో పేదలకు ఎక్కువ మేలు చేకూరిందో బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్ యూజీడీ డీఈ రామకృష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరీ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి


గర్భిణులకు పౌష్టిహారం అందజేస్తున్న కార్పొరేటర్ రాజేశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్):తల్లిపాలతో సహజసిద్ధమైన వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి అన్నారు. మారుతీనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం గులామొహుద్దీన్‌నగర్ పట్టణ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యాన తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజేశ్వరి ముఖ్య అతిథిగా పాల్గొని తల్లిపాల విశిష్టతను వివరించారు. ఆరోగ్య కేంద్రం కమ్యునిటీ ఆర్గనైజర్ దాసరి ప్రశాంత్‌కుమార్, నాయకులు తోట పాండు, అంగన్‌వాడీ టీచర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమృత తుల్యం తల్లిపాలు


తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్):ఎంత డబ్బు చెల్లించినా కొనుగోలు చేయలేనిది, పేద ధనిక తారతమ్యం లేకుండా ప్రతీ తల్లి బిడ్డకు ఇవ్వగలిగిన ఆస్తి తల్లిపాలు మాత్రమేనని 27వ డివిజన్ కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి అన్నారు. 27వ డివిజన్ గులాబీతోటలో శుక్రవారం జరిగిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. గర్భిణులు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఆహారాన్ని సక్రమంగా తీసుకోవాలని సూచించారు. శానిటరీ ఇన్స్పెక్టర్ ఆర్.రామ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్ కొండాయ గుంట రాము, నాయకులు మహబూబ్ జాని,డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



అలంకార్ సెంటర్‌లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకట నారాయణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ ధరించకపోవడంతోనే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని ఎస్ఎన్‌పురం ఇన్స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా ఉత్తర్వుల ప్రకారం డీసీపీ విశాల్‌గున్ని, ఏసీపీ రవికాంత్ ఆదేశాలతో హెల్మెట్ వాడకంపై అలంకార్ సెంటర్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఒక రక్షణ కవచంగా ఉంటుందన్నారు. ప్రాణం ఎంతో విలువైనదని, రోడ్డు ప్రమాదాలలో ఒక వ్యక్తి చనిపోతే అతని కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. హెల్మెట్ ధరించడం వలన ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు పోయే అవకాశాలు తక్కువగా ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి బయటపడాలని సూచించారు. ఎస్ఐ రంగనాథుడు, సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషా ప్రేమికుడు మండలి


డాక్టర్ సమరానికి పురస్కారం ప్రదానం చేస్తున్న మండలి బుద్ధ ప్రసాద్, లక్ష్మీకాంతం, సుబ్బారావు

విజయవాడ కల్చరల్: మాతృభాషా ప్రేమికుడు మండలి వెంకట కృష్ణారావు అని పూర్వపు కలెక్టర్ డాక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం, మండలి ఫౌండేషన్, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బందరురోడ్డు బాలోత్సవ్ భవన్‌లో శుక్రవారం సభ నిర్వహించారు. మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు 98 జయంతి ఉత్సవం, ప్రముఖ వైద్యుడు డాక్టర్ సమరానికి మండలి వెంకట కృష్ణారావు స్మారక పురస్కార సభలో లక్ష్మీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నేత మండలి అని కొనియాడారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ తొలి తెలుగు ప్రపంచ మహాసభలను హైదరాబాద్‌లో విజయవంతగా నిర్వహించారని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధికి అనేక ప్రణాళికలు రూపొందించినట్లు గుర్తుచేశారు. మండలి పురస్కారం అందుకుంటున్న ప్రఖ్యాత వైద్యులు డాక్టర్ సమరం సామాజిక సేవలను వివరించారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు స్ఫూర్తితో ఆంధ్ర సారస్వత పరిషత్ ద్వారా భీమవరంలో తెలుగు మహాసభలు నిర్వహించినట్లు తెలిపారు. గజల్ సాహిత్యం గురించి మాట్లాడుతూ గజల్ అంటే ప్రేమతో పలకరిచడం అన్నారు. గానంతో ఆత్మీయంగా ఆలింగనంచేసుకోవడమని తెలిపారు. ముకుంద శర్మ రచించిన గజల్‌ను గానం చేశారు. నిర్వాహకులు డాక్టర్ సమరానికి 2023 సంవత్సరానికి గానూ మండలి వెంకట కృష్ణారావు స్మారక పురస్కారాన్ని అందించారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్, సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు నగరంలో శాంతిర్యాలీ

లబ్బీపేట(విజయవాడతూర్పు):మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ చర్చెస్ ఆధ్వర్యంలో శనివారం శాంతిర్యాలీ నిర్వహిస్తున్నట్లు విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, సీయస్ఐ కృష్ణా గోదావరి డయాసిస్ బిషప్ జార్జి కొర్నేలియస్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని బిషప్ అజరయ్య పాఠశాల నుంచి సాయంత్రం 4 గంటలకు ఈ శాంతి ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. నగరంలోని అన్ని క్రైస్తవ సంఘాలు ఈ ర్యాలీలో పాల్గొని మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు కేంద్ర, అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న అనాగరిక చర్యలను మానవతా వాదులందరూ తీవ్రంగా ఖండించాలన్నారు. ఇప్పటికీ భయానక పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. మతం మానవత్వం వైపు నడిపించాలే తప్ప, మతోన్మాదం వైపు నడిపించకూడదని తెలిపారు. ఈ ర్యాలీ బిషప్ అజరయ్య స్కూల్ గ్రౌండ్ నుంచి శిఖామణిసెంటర్, రెడ్‌సర్కిల్, సీఎస్ఐ సెయింట్ పాల్స్ బసిలిక చర్చి వరకూ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని బిషప్‌లు జోసఫ్ రాజారావు, జార్జి కొర్నేలియస్‌లు పిలుపునిచ్చారు.

మలేరియా, డెంగీ కేసులపై అప్రమత్తంగా ఉండండి


కృష్ణలంకలో పర్యటించి ప్రజలతో మాట్లాడుతున్న బయాలజిస్ట్ సూర్యకుమార్

కృష్ణలంక(విజయవాడతూర్పు):మలేరియా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ కార్పొరేషన్ బయాలజిస్ట్ సూర్యకుమార్ కృష్ణలంకలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శుక్రవారం ఆయన నెహ్రూనగర్, చినతిరుమలరావు వీధి, ఇందిరా కాలనీ, గౌతమీనగర్, ద్వారకానగర్, సత్యంగారిదొడ్డి, రణదీవెనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. గౌతమీనగర్‌లో రంగా విగ్రహం వద్ద ఓ వ్యక్తికి మలేరియా జ్వరం సోకడంతో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందితో సర్వే నిర్వహించారు. లార్వాలు నిల్వ ఉండే నివాస గృహాలను పరిశీలించి పూర్తిగా నిర్మూలించే చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డు వలంటీర్లు కచ్చితంగా వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఫీవర్ సర్వే నిర్వహించి సత్వర వైద్య సేవలు అందించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వీధిలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి మలేరియా, డెంగీ లార్వాలను నిర్మూలించేందుకు యాంటీ లార్వా మెజర్స్ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని పీడీపీ సిబ్బందికి సూచించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, హెల్త్ సైపర్‌వైజర్ రాము, హెల్త్ అసిస్టెంట్ బలరాం, రాఘవరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గుర్తు తెలియని రైలు కింద తలపెట్టి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై జీఆర్‌పీ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్లాట్‌ఫామ్ బర్ వన్‌లోని దక్షిణం వైపు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆయన జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటన స్థలానికి చేరుకున్న జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

దోపిడీ, హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

విజయవాడస్పోర్ట్స్: ఓ వ్యక్తిని బెదిరించి దోపిడీ చేసి, అతన్ని హత్య చేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు నిందితులకు ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విజయవాడ ఏడవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.నాగేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఓ వ్యక్తి పెయింటింగ్ పనులు చేసి జీవనం సాగించేవాడు. పెయింటింగ్ సామగ్రి కొనుగోలు చేసేందుకు 2021 నవంబర్ ఆరో తేదీన విజయవాడ వన్‌టౌన్‌లోని గద్దబొమ్మ సెంటర్‌కు వచ్చాడు. అదే సమయంలో విజయవాడ గొల్లపాలెం గట్టు ప్రాంతానికి చెందిన గంజిరిబోయిన ప్రసాద్, కొరపాటి నాగేశ్వరరావు అక్కడకు వచ్చి పెయింటర్‌ను డబ్బులు ఇవ్వమని బెదిరించగా, అతడు అందుకు నిరాకరించడంతో అతని రెండు చేతులను వెనక్కి విరిచి కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో పెయింటర్‌కు ఛాతీపై తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసిన వన్‌టౌన్ పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.జేమ్స్ న్యాయస్థానానికి వాదనలు వినిపించారు. 11 మంది సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితులు గంజిబోయిన ప్రసాద్, కొరపాటి నాగేశ్వరరావులకు జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

● ఆత్మీయ స్వాగతం


ఆప్కాబ్ వజ్రోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలుకుతున్న ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి, ఎమ్మెల్సీ రుహుల్లా.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. భీమన వారిపేటకు చెందిన బయవరపు రవికుమార్ పూల మార్కెట్‌లో పని చేస్తుంటాడు. రవికుమార్‌తో పాటు అతని సోదరుడు రాజ్‌కుమార్ , తల్లి ఒకే పోర్షన్‌లో ఉంటారు. రవికుమార్‌కు వివాహం కాగా మద్యం తాగడం వల్ల భార్యాభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. దీంతో రవికుమార్ భార్య నూజివీడులోని పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యను ఎన్ని సార్లు కాపురానికి రావాలని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. గురువారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన రవికుమార్ తన గదిలోకి వెళ్లి పడుకున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచిన రాజ్‌కుమార్ తన అన్న గదిలో చూసే సరికి ఫ్యాన్‌రాడ్‌కు కండువాతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో కంగారు పడిన రాజ్‌కుమార్ చుట్టుపక్కల వారిని పిలిచి ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నించాడు. అయితే అప్పటికే రవికుమార్ ప్రాణాలు పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

భార్య, కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):తన భార్య , కుమార్తె కనిపించడం లేదనే ఫిర్యాదుతో కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. గంగానమ్మ గుడి ప్రాంతానికి చెందిన కోయ్య మణికంఠ, తేజస్విని భార్యాభర్తలు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. మణికంఠ గతంలో విజయవాడలో రియల్ ఎస్టేట్‌లో పని చేసేవాడు. వచ్చే జీతం సరిపోకపోవడంతో కొద్ది నెలల కిందట హైదరాబాద్‌లో ఉద్యోగం చేయసాగాడు. ఆగస్టు 1వ తేజస్విని భర్తకు ఫోన్ చేసి చేతికి ఉన్న పచ్చబొట్టు తీయించుకునేందుకు హాస్పటల్‌కు వెళతానని చెప్పింది. అదే రోజు సాయంత్రం నుంచి తేజస్విని ఫోన్ పని చేయకపోవడంతో ఆందోళన చెందిన మణికంఠ విజయవాడ వచ్చి ఇంట్లో చూసే సరికి భార్య, కుమార్తె కనిపించలేదు. దీంతో బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేగంగా కాపు కల్యాణ మండపం పనులు

● ఎదురుచూపులు నెరవేర్చిన ప్రభుత్వం
● రూ.కోటి నిధులు మంజూరు
● 62వ డివిజన్‌లో నిర్మాణం


నిర్మాణంలో కాపు కల్యాణ మండపం

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం కాపులకు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు నిర్వహిస్తోంది. కాపులు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కల్యాణ మండపం నిర్మాణానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కోటి రూపాయల నిధులు మంజూరు చేసింది. 62వ డివిజన్‌లు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఈ ప్రాంతంలో కాపులకు ప్రత్యేకంగా కల్యాణ మండపం నిర్మించాలనే ఉద్దేశంతో నిధులు మంజూరు చేయించారు. ఫిబ్రవరిలో రాష్ట్ర మంత్రులు తానేటి వనిత, బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు శ్లాబుస్థాయికి చేరుకున్నాయి. గతంలో 64వ డివిజన్లో పంపింగ్ స్టేషన్ వద్ద భూమిపూజ చేసిన శిలాఫలకం అలాగే వదిలి వేయడం జరిగింది. దీంతో ఆ ప్రాంతంలోని కాపు సామాజిక వర్గానికి చెందిన వారు మనస్థాపం చెందారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నిధులు మంజూరు చేయించి కల్యాణ మండపం నిర్మాణం చేస్తుంది. అన్ని శుభకార్యాలు నిర్వహించుకొనేందుకు వీలుగా కల్యాణ మండపం ఇరు వైపులా రెండు గదులు, పెద్దహాలు నిర్మిస్తున్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని డీఈ గురునాథం తెలిపారు.

వైఎస్సార్ సీపీ చేతల ప్రభుత్వం



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని కాపు కళ్యాణ మండపం నిర్మాణంతో నిరూపణ అయింది. గత ప్రభుత్వం భూమిపూజ చేసి వదిలి వేస్తే ఈ ప్రభుత్వం కల్యాణ మండపం నిర్మిస్తోంది.ఎమ్మెల్యే మల్లాది విష్ణు కృషితో కాపుకల్యాణ మండపం నిర్మాణం జరుగుతుంది.

అలంపూరు విజయలక్ష్మి, కార్పొరేటర్

ఎంతో సంతోషకరం



పాయకాపురం ప్రాంతంలోని కాపు సామాజిక వర్గానికి చెందిన ప్రజానీకం ఎప్పటి నుంచో కల్యాణ మండపం కోసం ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కాపుల కలను నెరవేరుస్తోంది. కాపుల కల్యాణ మండపం నిర్మించడం సంతోషదాయకం.

బోరా బుజ్జి, స్థానికుడు

31వ డివిజన్‌లో ఓటర్ల సర్వే

మధురానగర్(విజయవాడసెంట్రల్):31వ డివిజన్ ముత్యాలంపాడు, శ్రీనగర్ కాలనీ, టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఓటర్ల సర్వేను బీఎల్‌వోలు నిర్వహించారు. ఓటర్ల జాబితాలో పేర్కొన్న ఇంటి నంబర్‌ల ప్రకారం ఆయా పేర్లు అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు 6,7,8 ఫామ్స్‌లోని వివరాలను ఓటర్లకు తెలియచేశారు. మృతి చెందిన వారి పేర్లు తొలగించటం, అడ్రస్‌లో మార్పులు జరిగితే వారి ఆధార్ కార్డు ప్రకారం ఓట్లను ఆ ప్రాంతంలో ఉండే విధంగా మార్పులు చేశారు.

13న తుర్లపాటి స్వరరాగభూషణ్ పురస్కారాల ప్రదానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జర్నలిజంలో మొట్టమొదటి పద్మశ్రీ అవార్డు గ్రహీత తుర్లపాటి కుటుంబరావు జయంతి కార్యక్రమం ఈ నెల 13న విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుర్లపాటి జయంతిని పురస్కరించుకుని ఆయన పేరు మీద మహిళలకు 'తుర్లపాటి స్వరరాగభూషణ్ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. గాయనీమణులు అమలారాణి, మీనా కుమారి, సువర్ణలక్ష్మి, విష్ణుప్రియ, ప్రజ్ఞ, వడ్డాది కామేశ్వరి, బీహెచ్ కామేశ్వరి, మాధవిలకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.